# దుస్తులు

"మనస్సు తొడుక్కునే దుస్తులు కొన్ని పైకి కనపడతాయి. కొన్ని లోదుస్తుల్లా లోపలే ఉండిపోతాయి. మనస్సు ఈ దుస్తుల్ని ఎందుకు వేసుకుంటుందో ఇదమిత్థంగా చెప్పలేం. భయం వల్ల జీవిత అభద్రత నుంచి రక్షణ అనుకొని కొందరు వేసుకొంటారు. కొందరు తాము ఇతరుల కన్నా భిన్నం, గొప్ప అనే అహం, అధికారం, సాంఘిక హోదా కోసం వేసుకుంటారు. దాన్నే కొందరు తేజస్సు అని వర్ణిస్తారు."

"మనస్సు వేసుకునే దుస్తులు కృతకంగా అదనంగా అతికించుకున్న ఈకలు తోకలు. అవి కపటత్వానికి నిదర్శనాలు. అవి మనిషి నుంచి మనిషిని దూరం చేస్తాయి. ఈ దుస్తుల్ని వదిలించుకున్నప్పుడు మనుషులు స్వచ్ఛమైన సహజ మానవులుగా, నిస్వార్థపరులుగా ఎదగడం ఇప్పటికీ సాధ్యమే."

★ ★ ★

సత్తయ్య పుట్టినప్పుడు అందరిలా సహజంగానే పుట్టాడు. పసివాడుగా పక్కలోనే కాలకృత్యాలు తీర్చుకున్నాడు. తల్లే సిగ్గు నేర్పింది. తల్లే భాష నేర్పింది. బట్టలు వేసుకోవడం నేర్పింది. తల్లే సత్తయ్య తనను తాను ప్రేమించుకోవడాన్ని నేర్పింది. పేలాలు జేబులో పోసి 'ఎవలకు పెట్టకుండా తిను' అని తల్లే స్వార్థాన్ని నేర్పింది. తల్లే ప్రేమించడం నేర్పింది.

సత్తయ్య స్వార్థాన్ని ప్రేమించాడు. అతని తల్లి ఇప్పుడు పల్లెటూర్లో పాత పెంకుటింట్లో ఉంటోంది. సత్తయ్య బంగళాలో ఉంటాడు. తల్లికీ, చెల్లికీ, తమ్ముడికీ చీరసారెలు అందరికన్నా కాస్త ఎక్కువే ఇస్తాడు. కానీ, తన ఇంట, తన వెంట ఉంచుకోడు.

సత్తయ్య టీచర్ ట్రెనింగ్ చేస్తున్నప్పుడు, ప్రేమించిన సుమతిని పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు ఇంటిల్లిపాదీ వ్యతిరేకించారు. అతనికి అదే వరం అయిపోయింది. ఆ సాకుతో అయిన వాళ్ళందరితో సంబంధం తెంపుకొని, బాధ్యతలు వదిలేశాడు. అలగడం వల్ల జరిగిన నష్టం తమకే అని తెల్సి వచ్చాక మనుమల మీది ప్రేమ పేరుతో కొడుకుతో మళ్ళీ సంబంధం కలుపుకుంది తల్లి. క్రమంగా అయినవాళ్ళూ, ఊరూవాడా తిరిగి సంబంధాలు కలుపుకున్నారు. తాను జీవితంలో పైకి రావడం వల్లే వాళ్ళంతా తిరిగి సఖ్యంగా మారారని, తాను జీవితంలో వెనకబడిపోయి ఉంటే వారి పాదాల కింద తనను తొక్కేసి ఉండేవారని సత్తయ్య అభిప్రాయం. ఆ అభిప్రాయం అతనికిపుడు సమాజంలో ఉండే స్థానాన్ని మరింతగా ప్రేమించేటట్లు చేసింది.

టీచర్ ట్రెనింగ్ పూర్తయ్యాక సత్తయ్య, సుమతి ఇద్దరూ ఒక ప్రైవేట్ స్కూల్లో టీచర్లుగా చేరారు. జెడ్.పి.లో కన్సాలిడేటెడ్ జీతంపై ఇద్దరూ ఎన్నికైనారు. ఆ ఉద్యోగాలు చేస్తూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాయగా రాయగా సత్తయ్యకు ఈ ఉద్యోగం దొరికింది. వంటపని, ఇంటిపని చేస్తూ, పిల్లల్ని కంటూ సుమతి పరీక్షల్లో వెనుకబడిపోయింది. నిజానికి సత్తయ్య కన్నా సుమతే కాస్త తెలివి కలది.

★ ★ ★

సత్తయ్య యమ్మార్వోగా ఉద్యోగంలో చేరి చాలాకాలమే అయింది. అధికారిగా తనను తాను భావించుకునే క్రమంలో సుమతిని టీచర్ ఉద్యోగం మాన్పించి ఇంటికి, తన వెంట అలంకారికంగా తిరగడానికి పరిమితం చేశాడు. మానసిక బానిసత్వంలోని సుఖం రుచి మరిగాక, టీచర్ జీవితం కన్నా ఇల్లాలుగానే ఎక్కువ సుఖం అనిపించి సుమతి తాను యమ్మార్వో భార్యని అనే అహంకారపూరిత వ్యక్తిత్వాన్ని సంతరించుకుంది. సత్తయ్య కోసం ఎవరైనా ఇంటికొస్తే అతడు లేనప్పుడు తనే యమ్మార్వో అన్నట్లు ప్రవర్తించడం అలవాటైంది. సిబ్బంది కూడా సుమతిని సుమతిగా కాకుండా "మిసెస్ యమ్మార్వో" అని గౌరవించడం అలవాటైంది. తన తండ్రి వయసున్న పేష్కారు "అమ్మగారు" అని పిలుస్తుంటే దొర్సాని అని పిలిపించుకున్నంత ఆనందం.

సత్తయ్యంటే అతని సిబ్బంది అందరికీ హడలు. ఇపుడతను తాను పుట్టడమే ఆఫీసరుగా పుట్టినట్లు ప్రవర్తిస్తాడు. అతనికి సిబ్బంది పట్ల గానీ, ప్రజల పట్ల గానీ ప్రేమ లేదు. అతనికున్నదల్లా వారిపై తనకు అందివచ్చిన అధికారంపై ప్రేమ. తన అధికారాన్ని ప్రేమించడాన్నే అతడు ప్రజల్ని ప్రేమించడంగా భావిస్తాడు. సత్తయ్య అధికారిగా తప్ప మనిషిగా కనపడ్డం ఆగిపోయి చాలాకాలం అయిపోయింది. చాలామంది అధికారులు, మంత్రులు, పై కులస్తులు, మగపురుగులు అహంకారులుగా, అధికారులుగా తప్ప మనిషిగా కనపడ్డం ఆపేశారు. సత్తయ్య వారికి ఒక ప్రతీక.

ఇపుడు సత్తయ్య నడకలో నిలువెల్లా అహంకారం, గర్వం తొణికిసలాడుతుంటాయి. దాన్ని కొందరు అతని మొహంలో వెలిగే గొప్ప తేజస్సు అని ప్రశంసిస్తుంటారు. ఆఫీసరంటే అలా ఉండాలి అని ఆ దర్పాన్ని పొగుడుతారు. సత్తయ్య మాటల్లోని దర్పం పెద్దపులి గాండ్రింపులా ఉంటుంది. అతని ముఖ కవళికల్లోనే కాదు, కదలికల్లోనూ గర్వం, తేజస్సు నిండుకుండలా కదలాడుతూ ఉంటాయి.

ప్రజలకు మేలు చేయడం కోసం పెట్టిన రూల్సునే మెలిక తిప్పడం ద్వారా వారికి వ్యతిరేకంగా ఎలా మార్చవచ్చునో సత్తయ్యకిపుడు సహజం అయిపోయింది. మామూళ్ళిచ్చినపుడే ఆ మెలికల్ని వదిలి సాపు అవుతాడు. దాంతో బాగానే సంపాదించాడు. సుమతి, సత్తయ్య ఇప్పుడు తాము పుట్టి పెరిగిన పేదరికం మరిచిపోయారు. బంగారు చెంచా నోట్లో పెట్టుకొని పుట్టినవారిలా మాట్లాడతారు. వారి అలవాట్లూ, సంస్కృతీ అలా రూపాంతరం చెందాయి. అయితే, పుట్టు ధనవంతుల్లో ఉండే ఒక రకమైన సహృదయత వీరిలో లోపించింది. డబ్బు కోసం ఏది చేసినా తప్పు కాదనే తత్వాన్ని ఇద్దరూ బాగా జీర్ణించుకున్నారు. అదంతా వారి కొవ్వు ముడతల్లో, చీరల్లో, నగల్లో, డెకొరేషన్‌లో, బ్యాంక్ బ్యాలన్సుల్లో, రియల్ ఎస్టేట్స్‌ల్లో పేరుకుపోతూ ఉంది.

★ ★ ★

చీకటి. ఎగుడుదిగుడుబాట. హెడ్‌లైట్లతో జీపు అడవిలో ఏనుగు గున్నలా పరిగెడుతోంది. సత్తయ్య బొర్ర ఊగుతోంది. సత్తయ్యకూ డ్రైవర్‌కూ మధ్యన కూర్చున్న సుమతి కుదుపులకు ఆయాసపడుతోంది.

డ్రైవర్ బాట మలుపుల్ని నిశితంగా పరిశీలిస్తూ జీపు పోనిస్తున్నాడు. భుక్తాయాసంతో సత్తయ్యకు నిద్ర ముంచుకువస్తోంది. సుమతి హెడ్‌లైట్ల వెలుగులో అడవిని ఆసక్తిగా చూస్తోంది. కుందేలు పిల్ల ఒకటి లైట్ల వెలుగుకు కంగారుపడి రోడ్డుకడ్డం పరిగెత్తి చీకట్లో మాయమైంది.

"ఏమండీ, మన ఇంట్లో రెండు కుందేల్లు పెంచుకోవాలండీ" ప్రేమగా అంది సుమతి. "అలాగే' అంటూ తల ఊపాడు సత్తయ్య. అంతలో జీపు హెడ్‌లైట్లు ఆరిపోయాయి. చీకట్లో బండి స్లో అవుతోంది.

"ఏమైంది?" కంగారుగా అడిగింది సుమతి. డ్రైవర్ మాట్లాడలేదు. గేర్లు మారుస్తున్న డ్రైవర్‌కు ముచ్చెమటలు పోస్తున్నాయి. చీకట్లో కంగారు పడుతున్న డ్రైవర్ చేయి సుమతి తొడలకు తాకుతుంటే గజగజ వణికిపోతోంది.

"ఏమైంది?" గట్టిగా అరిచాడు సత్తయ్య.

"లైట్లు పనిచేస్తలేవు. బ్రేకులు కూడా ఫెలయినట్లున్నాయి సార్."

సత్తయ్య నిద్రమత్తు దిగిపోయింది. సుమతి ప్రాణభయంతో భర్తకు మరింత దగ్గరగా జరిగి గట్టిగా అదుముకుంది. బండిలోంచి దూకేస్తే కాలు విరిగినా ప్రాణాలైనా దక్కుతాయేమోనని ఆలోచిస్తున్నాడు సత్తయ్య.

"ఎవరూ కదలొద్దు." డ్రైవర్ గొంతులోని కఠినత్వం కంగారో, కర్కశత్వమో అర్థంగాక సత్తయ్య సర్దుకొని కూర్చున్నాడు. తనను నెట్టి చంపేసి సుమతిని రేప్ చేయడానికి డ్రైవర్ వేసిన ఎత్తుగడ కాదుగదా ఇది అని విలవిల్లాడిపోయాడు సత్తయ్య. డ్రైవర్ను ఎపుడెపుడు ఎలా తిట్టిందీ, అపుడతను ఎలా చూసిందీ గుర్తుకు రాసాగాయి.

హెడ్‌లైట్లు మళ్ళీ వెలిగి మళ్ళీ ఆరిపోతూన్నాయి. రోడ్డు మలుపుల్తో పాటు డౌన్ ఎక్కువై బండి అదుపు తప్పుతోంది. రోడ్డు దిగిన బండి చెట్టుకు గుద్దుకొని ఆగిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా జీపును చెట్టుకు పెట్టి పెద్ద ప్రమాదాన్ని తప్పించాడని వారికి తెలియదు. ఆ కంగారులో వారు గమనించే స్థితిలో లేరు.

★ ★ ★

"ఒరే సత్తిగా! నేనే ఆఫీసర్నని, నాకెదురే లేదని విర్రవీగినవు గదరా. ఈ గుతుపలతోని పుర్రె పగులగొట్టి జీపు ఆక్సిడెంట్ల చచ్చినవని చెప్తం" అంటూ కర్రలతో నలుగురు సత్తయ్య మీదికి ఉరికారు. సత్తయ్య భయంతో వెనక్కి తిరిగి పరుగు తీశాడు.

"ఏమండీ, ఆగండి. నాకు భయంగా ఉందండి"

"ఒర్రకు. ఒర్రితివంటె నిన్ను గూడ సంపుతం. ఆ పిరికిగాడ్ది కొడుకు నిన్ను ప్రేమించిన్నంటె నమ్మి ఎట్ల పెండ్లి చేసుకున్నవే. వానికి నువ్వు ఎన్నో పెండ్లానివే. నీకు వాడు ఎన్నో మొగుడే. మేం చెప్పినట్టు విను. లేకపోతే సంపుతం."

"మీకు దండం బెడ్త. ఈ నగలన్ని తీస్కోన్రి. నన్నేం చేయకున్రి."

"మాకు ఈ నగలెందుకే. నీ మొగుడు ఈ నగలు ఏం చేసి సంపాదించిండో నీకు ఎరుక లేదానే. ఆ పాపపు నగలు మాకెందుకే." ఎడాపెడా సుమతిని వాళ్ళు కొడుతూనే ఉన్నారు. సుమతి ఏదేదో అరుస్తూ ఏడుస్తోంది.

"సంపుతం.... నోరు మూసుకో."

"మీకు దండం బెడ్త. ఎట్ల చెప్తే అట్ల ఇంట. నన్ను సంపకున్రి"

"గట్లరా దారికి. నీ మొగుడు లంచాలు తీసుకుంటుంటె ఒక్కనాడన్న ఇది అన్యాయమండీ అని అన్నావే? ఇంకా ప్రోత్సహించుకుంట అది కొను, ఇది కొను అనుకుంట లంచాలకు ఎగదోలితివి గదనే" అంటూ వాళ్ళు సుమతిని బిగ్గరగా కౌగిలించుకొని అలాగే ఎత్తుకెళ్లి చెట్టుకు ఒరిగిపోయిన జీపులో వెనుక సీటుపై చేర్చారు.

★ ★ ★

సత్తయ్య పరిగెడుతూనే ఉన్నాడు. దారిలో మరో నలుగురు కర్రల్తో అడ్డగించడంతో స్పీడందుకున్నాడు. చుట్టూ చీకటి. ఊగుతున్న బొర్రతో ఆయాసంగా ఉంది. చెట్ల సందుల్లోంచి కొన్ని దీపాలేవో కనిపించాయి. ఇదేదో పల్లెలాగా ఉంది. వీళ్ళను తీసుకొనిపోయి సుమతిని రక్షించుకోవాలి. 'వాళ్ళను చావదన్ని యాక్సిడెంట్లో పోయారని చెప్పాలి' అనుకున్నాడు. అలా అనుకోవడంతో సగం ధైర్యం వచ్చింది. జనం కనపడ్డంతో పూర్తి ధైర్యం వచ్చింనది. దాంతో తాను ఆఫీసర్ననే విషయం గుర్తుకు వచ్చి పరిగెడుతున్న వాడల్లా ఆగిపోయి హుందాగా నడకసాగించాడు.

"అరె మన యమ్మార్వో సాబు, జీపు ఫేలయిందా ఏంది సారు" అంటూ వాళ్ళు పలకరించడంతో దిగిన అధికార మత్తు మళ్ళీ ఇంజక్షన్ ఇచ్చినట్లు ముఖవర్చస్సులో తేజస్సుగా ఎక్కుతోంది. హుందాగా భుజా లెగరేశాడు.

"మన ఇండ్ల జాగలకు పరంపోగుకు పట్టాలిమ్మన్నా, రేషను కార్డులిమ్మన్నా మంచిది మంచిదనుకుంట ఎగవెట్టింది వీడేకాదురా" ఎవరో యువకుడు ఇదే సందు అన్నట్టు దగ్గరకు వచ్చాడు.

"మన సత్తికి లేడీస్ కోటా కింద రేషన్ షాపు ఇప్పిస్త అని తిప్పుకొని మొగనికి ఎడబాపి ఉంచుకొని కడుపు జేసి తీయింది వీడేరా"

"పోలీసోల్ల లెక్కగీరాత్రి బయిలెల్లి మల్లెవతిని ఎత్తుకపోదామని వచ్చినవురా. అరేయి, తాళ్ళు తేపోరి. ఇగ వీడు మల్ల దొరుకడురా"

ఆ మాటల్తో సత్తయ్యకు వేరే ఇంజక్షన్ ఇచ్చినట్టుగా అధికార మత్తు, మొహంలోని తేజస్సు మాయమై చల్ల చెమటలు పట్టాయి. రెక్క పట్టుకున్న వాణ్ణి కొరికి పట్టు విడిపించుకొని పరుగందుకున్నాడు.

"అరేయి, అటు ఉరుకకురా గుడ్డేలుగులు, పాములున్నై. బురద గుంటలల్ల పడితే అటే కూరుకపోతవు."

చావు భయం ముందు పిరికితనం పారిపోయింది. ఊరివాళ్ళు కొద్దిదూరం వెంబడించి ఆగిపోయారు. కుక్కలు మొరిగి మొరిగి వెనక్కి వచ్చేశాయి. ఎప్పుడూ తమను బెదరించే తహసీల్దారు తుప్పల్లబడి పరిగెట్టడం వారికి వినోదంగా ఉంది.

★ ★ ★

కుక్కల అరుపులు దూరం కావడంతో చెట్టు దిగాడు సత్తయ్య. అటూ ఇటూ జాగ్రత్తగా చూశాడు. అడవి నిండా పరుచుకున్న చెట్లు చుక్కల వెలుగును పైపైనే పీల్చేయడంతో కిందంతా చీకటి.

"రేపు చెప్తా గాడిద కొడుకుల సంగతి. పోలీసుల్ని పంపి ఊరును వల్లకాడు జేపిస్త. ఈ గుడిసెలన్ని కాలవెట్టిస్త. నక్సలైట్లు స్థావరంగా ఉన్నారని రేపులు చేయిస్త, ఏమనుకున్నారో" అని పళ్ళు కొరికాడు సత్తయ్య. హుందాగా నడక సాగించాడు.

కొద్ది దూరం నుంచి నక్కల అరుపులు వినిపించాయి. మరోవైపు నుంచి గుడ్డేలుగులా ఏదో అరుపు వినిపించింది. చెట్టు మీంచి అకస్మాత్తుగా ఏదో తన వెనకే దబ్బాల్న కిందపడింది. 'అమ్మో' అనుకుంటూ మళ్ళీ హోదా మరిచి పరుగందుకున్నాడు సత్తయ్య.

చీకట్లో తుప్పలకు తట్టుకొని ప్యాంటు, షర్టు చీలికలు పేలికలైపోయాయి. చినిగిన ప్యాంటు పేలికలు కాళ్ళ కిందపడి బోర్లాపడిపోతున్నాడు. రెండు మూడుసార్లు బొక్కబోర్లా పడిపోయాక ఇహ లాభం లేదని ప్యాంటు విడిచేసి పరుగందుకున్నాడు. షర్టు పేలికలు కొమ్మలకు, తుప్పలకు తగుల్కొని ఆ

కొమ్మలే లాగి చరిచినట్లు చీరుకుపోతోంది శరీరం. ఏదో రాయిలా కనపడితే ఒరిగి ఆయాసం తీర్చుకున్నాడు సత్తయ్య. షర్టు విప్పేశాడు. లోపలి బనీను కూడా చిరిగిపోవడంతో దాన్నీ విడిచేశాడు. లోదుస్తుల్లో ఒంటిమీద కట్ డ్రాయర్ ఒక్కటే మిగిలింది. చుట్టూ చీకటి. ఎక్కడ ఏం ఉందో తెలియడంలేదు.

బుస్సుమని ఏదో శబ్దం రావడంతో తాను ఇంతదాకా సేదదీరింది రాయి కాదని, పాముల పుట్ట అని స్ఫురించి సత్తయ్య నాలుకపై తడారిపోయింది. మళ్ళీ పరుగందుకున్నాడు. పరిగెడుతూనే ఉన్నాడు.

★ ★ ★

"హ్యాండ్సప్. కదిలితే కాల్చేస్తాను" అనే గొంతు వినపడ్డంతో చటుక్కున ఆగిపోయాడు సత్తయ్య. మనిషి అలికిడి తెలియడంతో ఎంతో ధైర్యం వచ్చింది.

అకస్మాత్తుగా వెన్నుకు రైఫిల్ మొన గుచ్చుకోవడంతో సత్తయ్య ఒళ్ళు జలదరించింది.

"ఎవఁడ్రా నువ్వు" నక్సలైట్ దళ సెంట్రీ గొంతు క్రూరంగా ఉంది. అప్పటికే దళం లేచి అలర్టయింది. ఎవరో సత్తయ్యపై లైటు వేశారు. బొర్రమీంచి రెండు చెమట కాల్వలు డ్రాయర్లోకి జారుతున్నాయి. ఎగపోస్తున్నాడు. ఆ ఆకారం చూసి స్త్రీలు గొల్లున నవ్వారు. సత్తయ్య సిగ్గుతో చితికిపోయాడు. బొర్రమీంచి అతనికి తన డ్రాయరే కనిపించడంలేదు.

ఏం చెప్పాలో ఆలోచించుకునేంతలో పిడి గుద్దులు, తన్నుల్తో సత్తయ్య శరీరం రొట్టె పిండి ముద్దలా అయింది. "దాహం" అంటూ సైగ చేశాడు సత్తయ్య.

"నేను పోలీసాఫీసర్ను కాదు. ఎమ్మార్వో సత్తయ్యను. కొట్టకండి" అంటూ చేతులెత్తి దండం పెట్టాడు సత్తయ్య.

"అరేయ్ చేతికి చిక్కినంక కూడా అబద్ధాలా! నీ బొర్ర కరగదీస్తం. బాగతిని బలిసిన నిన్ను చూస్తేనే నువ్వు సర్కిల్ ఇన్స్పెక్టర్వో, డియస్పీవో అని తెలుస్తోందిరా. ఏం పేరు బే. ఎంతమంది వచ్చిన్రురా. ఎటుకెయి మాటు కాసిండ్రురా. చెప్పుబే" చితక పొడిచారు వాళ్ళు. బొక్కబోర్లా పడిపోయి దొరికిన వాళ్ళందరి కాళ్ళు పట్టుకుంటూ దండం పెట్టాడు సత్తయ్య.

"నా జీపు యాక్సిడెంటయింది. నా భార్య......"

"చావు బతుకుల్లో ఉంది. రక్షించండి అని పిలుసుకపోయి ఘెరాయించి అందర్నీ ఎన్కౌంటర్ చేయిద్దామని వచ్చినవా?"

డొక్కలో తగిలిన దెబ్బలకు భళ్ళున వాంతి చేసుకున్నాడు సత్తయ్య.

"నేను నిజంగానే యమ్మార్వోను. భీంరెడ్డి ఇంటికాడ డిన్నర్ తినిరాంగ జీపు ఫేలయింది. డ్రైవర్ను... భార్యను... ఎవరో దొంగలు......" ఏడుస్తూ మళ్ళీ ఏదో చెప్పబోయాడు. ఎవరో మూతిమీద తన్నారు.

వారిని ఆగమని చెప్పి దళ కమాండర్ ప్రశ్నించడం ప్రారంభించాడు.

"అయితే, మంద భీమయ్య పదేండ్ల నుంచి దున్నుకుంటున్న భూమిని లంచాలు తిని చిట్యాల భీంరెడ్డి పేరు మీద పహానీల రాయించింది నువ్వేనన్నమాట" ఆ మాటతో ఎరక్కపోయి ఎమ్మార్వోనని చెప్పుకున్నట్టయిందని వణకిపోయాడు సత్తయ్య.

"అంత వణికిపోతున్నవేంది. నీకున్నట్టు ప్రతి ఒక్కరికి బతుకు మీద తీపి ఉంటుంది గదా. నువ్వు ఎంతోమందిని పోలీసులు చంపకుండ, కొట్టకుండ కాపాడగలిగే అవకాశం ఉండీ, ఆ రిస్కు ఎందుకు తీసుకోలేదు పోయేది నీ ప్రాణం కాదుగనక. అంతేనా?"

"నాకు తెలిసి ఎవరికీ అన్యాయం చేయలేదు సార్"

"గౌరవం ఇస్తే గర్వానికి పోతే మూతి పండ్లు రాలగొడ్తం. నా కొడుకును పోలీసులు పట్టుకపోయిన్రు. సంపకుంట సూడున్రిసారు అని వారం రోజులు నీ సుట్టి తిరిగినా నీవు చేసిందేంది? అధికార మదం తలకెక్కి, స్వార్థానికి పీట వేసి అతన్ని రక్షించే రిస్కు తీసుకోలేదు నువ్వు. వాల్లు చంపి ఎన్‌కౌంటర్లో పోయిండని ప్రకటిస్తే నీ మెజిస్టీరియల్ విచారణలో అదే నిజం అని రాసినవా లేదా?"

సత్తయ్య తలవంచుకున్నాడు. "లోతుకుపోయిన కళ్ళతో ఇంటా బయటా జీపుకడ్డం పడి ఏడ్చిన ఆ ముసలి తల్లిని అటెండర్‌తో నెట్టేయించాడు. ఆమె కళ్ళలోని కడుపుకోత దుఃఖం ఆనాడు తనకు చిరాకు తెప్పించింది గానీ సానుభూతి కలిగించలేదు. ఎన్‌కౌంటర్‌పై మెజిస్టీరియల్ రిపోర్టు రాసినపుడూ అంతే రొటీన్‌గా రాసిపారేశాడు. తన గుండె రాయి కావడానికి కారణం గర్వమా, స్వార్థమా? అధికారమా, పిరికితనమా?" సత్తయ్య మనసు వేసుకున్న లోదుస్తులు తుప్పల్లో చిరిగిన బట్టల్లా చిరిగిపోతున్నాయి.

తమ్ముని పిల్లలు, చెల్లి పిల్లలు వేసవి సెలవుల్లో పెదనాన్న ఇంటికి పోదాం, పెదమామయ్య ఇంటికి పోదాం అని వస్తే "చిచోర (చిల్లర) పోరగాన్లు" అని విసుక్కుని బట్టలు, వస్తువులు పాడు చేస్తున్నారని వండిపెట్టలేక కష్టం అవుతున్నదని సుమతి చీదరించుకుంటే, తాను రెండో రోజే వారిని వాపసు పంపింది గుర్తొచ్చింది సత్తయ్యకు. ఆ పిల్లల్లో తన పట్ల గల ఆరాధనను చంపి వారికి దూరం అయిన క్రమమంతా గిర్రున కళ్ళలో కదలాడింది. ఎవరికోసం తానీ అధికారాన్ని, ఆధిక్యతని ప్రేమిస్తున్నాడు. తన స్వార్థం కోసమేనా?

"ఇక నుంచి అట్ల జేయసార్, నన్ను చంపకున్రి సార్, మీ రుణం తీర్చుకుంట సార్"

ఆ నక్క వినయం చూసి దళ ఉప కమాండర్‌కు కోపం రెట్టింపైంది. "అరేయ్ నిజం చెప్పురా. ఇండ్లు కాలినై. వరదలచ్చినై, ఎలక్షన్లు వచ్చినై అని వచ్చే పైసలల్ల ఎంతెంత తిన్నవ్‌రా"

"అరేయ్ నిజం చెప్పురా. రాష్ట్రంలోని నలభై శాతం దొంగ రేషన్ కార్డులను డీలర్ల లాభాల కోసం, మీ లంచాల కోసం మీరే సృష్టించలేదా? ప్రభుత్వం బోగస్ రేషన్ కార్డులు ఏరివేయాలనంగనే నువ్వు ఒక్కో డీలర్‌కు ఇచ్చిన డెబ్బయ్, ఎనభై దొంగ రేషన్ కార్డులను అట్లనే ఉంచి, అసలైన పేదోల్ల కార్డులు రద్దు చేస్తం అని బెదరించి, వాల్లు లొల్లి చేయంగనే, దొంగరేషన్ కార్డుల ఏరివేతను గవర్నమెంట్ ఆపేయండి అని అనంగనే హమ్మయ్య అని హాయిగా ఊపిరి పీల్చుకోలేదారా నువ్వు" కమాండర్ భార్య రైఫిల్‌తో అతని బొర్రపై ఆడుతూ అడిగింది.

"ఛల్ ఇగ ఉరుకుబే. మల్ల కనబడకు" అని అరిచాడు కమాండర్ అంతదాకా ఇచ్చిన మర్యాదంతా ఒక్కమాటలో తీసి పడేస్తూ.

"ఛల్ ఉరుకు" సెంట్రీ అరిచాడు. సత్తయ్య ఎంతకూ కదలడు. "గిట్లనే ఉరుకుమని ఉరికిచ్చి ఎనుకకెల్లి కాల్చి చంపుతరట పోలీసోల్లు. నన్ను గూడ గట్లనే వెనకకెల్లి కాల్చి సంపుదామనే ఉరుకుమంటున్రేమో" అని వణికిపోయాడు సత్తయ్య.

కొద్ది క్షణాలు చూసి అతన్ని చెట్టుకు కట్టేసి "బంగారం లాంటి నిద్రపాడు చేసె గదరా వీడు" అనుకుంటూ మరో జాగా వెతుకులాడుతూ ముందుకు సాగారు వాళ్ళు.

★ ★ ★

చెట్టుకున్న గోమార్లు (ఎర్ర గండు చీమలు) కుట్టి కుట్టి స్పృహ కోల్పోయాడు సత్తయ్య. అడవి

దోమలు కుట్టి చలిజ్వరం అందుకున్న విషయమూ అతనికి స్పృహలో లేదు. కళ్ళు తెరిచేసరికి పొద్దు వంగింది. పక్షులో, కోతులో అతని నోట్లోని డ్రాయర్ని లాక్కుపోయాయి. మోపులు కట్టుకోవడానికో ఏమో కట్టిన తాళ్ళను ఎవరో విప్పుకుపోయారు. అంతకు ముందే చూసినవారెవరో చేతికున్న వాచీ, ఉంగరం లాక్కుపోయారు. శరీరం తేళ్ళు కుట్టినట్టుగా మంటలు. చలిజ్వరం, వణకు. ఆకలి మందగించి కొవ్వు కరగడం మొదలైంది. దాహంగా ఉంది. నిస్సత్తువగా మెల్లిగా నడిచాడు. ఏదో గుంటలో కాస్త నీళ్ళు కనపడ్డాయి. ఆబగా దోసిల్లతో కడుపు నిండా తాగి మొహం మీద చల్లుకున్నాడు. నీడకు ఒరిగాడు.

సుమతి ఏమైపోయిందో, మళ్ళీ ఈ రాత్రంతా ఈ అడవిలోనే గడపాల్సి వస్తుందా? తాను మళ్ళీ నడవడం ఈ చలిజ్వరం, నిస్సత్తువతో చాతనయ్యేనా? వాళ్ళు సుమతిని ఏం చేశారో. మనస్సుకు శరీరం సహకరించలేదు. తాగిన నీళ్ళ మహత్యం ఏమిటో గాని కడుపు కలుపుకుంది. ఏడెనిమిదిసార్లు విరేచనాలైపోయాయి. మళ్ళీ దాహం. మళ్ళీ అవే నీళ్ళు. మళ్ళీ నీళ్ళ విరేచనాలు. శరీరం మంటగా ఉంది. చలిగా ఉంది. నిస్సత్తువతో నిద్రలోకి జారుకున్నాడు.

★ ★ ★

చెట్టుకు ఒరిగిపోయిన జీపులోకి చేర్చబడ్డ సుమతి పెనుగులాడుతోంది. గాజులు పగిలిపోయాయి. బట్టలు చిందరవందరయ్యాయి. ఎవడో క్రూరంగా కరుచుకున్నాడు. పెనుగులాడి స్పృహ కోల్పోయింది సుమతి. వాడు ఆమెతో ఇష్టానుసారంగా ఆడుకున్నాడు. ఎంతసేపైందో...

★ ★ ★

అకస్మాత్తుగా నిద్రలోంచి లేచి కూర్చున్నాడు సత్తయ్య. నన్నే దైవంగా భావించే సుమతి గురించి ఇలాంటి కల ఎందుకు వచ్చింది? తాను తిట్టిన అవమానంతో సుమతి డ్రైవర్‌తో లేచిపోతే తన పరువు, పిల్లల తెరువు, తన ఆస్తి, అంతస్తు, గౌరవం ఏం కావాలి?

"సుమతీ ప్లీజ్, ఇదంతా నీకోసమే చేశాను. నన్ను వదిలిపోవద్దు" బిగ్గరగా ఏడ్చాడు సత్తయ్య. ఆశ్చర్యం. అసలు నోట్లోంచి శబ్దమే రాలేదు.

"నీ పేరు ప్రతిష్టల కోసం, హోదా కోసం ఇవన్నీ చేశావు. అందుకు నన్ను సాధనంగా మార్చుకున్నావు నన్ను లెక్చరర్‌గానో, ఎమ్మార్వోగానో ఎదగకుండా చేశావు' అని సుమతి నిలదీస్తున్నట్లుగా అనిపించి అయోమయంగా అయిపోయాడు.

★ ★ ★

"అరె సత్తీ, నువ్వు ఇక్కడ ఉన్నావా" అంటూ ఆనందంగా ఉరికి వస్తున్న క్లాసుమేటు లెక్చరర్ అయిలయ్యను చూసి అది కలో, నిజమో అర్థం కాలేదు సత్తయ్యకు.

"నిన్ను కిడ్నాప్ చేసిర్రని పత్రికల్లో, రేడియోలో, టీవీలో ఒకటే ప్రచారం. నన్ను మధ్యవర్తిగా పంపిర్రు. డ్రైవరూ, సుమతీ హాస్పిటల్‌లో క్షేమంగా ఉన్నారు. బలమైన గాయాలైనా ప్రాణాపాయం తప్పింది. నువ్వు ఇక్కడ ఉన్నావేంది? ఈ ఆకారం ఏంది? మనిషివి సగమైపోయినవేంది? నీ డ్రెస్సు ఏమైంది?"

సత్తయ్యకు ఒక పక్క ఆనందం, ఒక పక్క ఆశ్చర్యం, సుమతి క్షేమంగా ఉంది. డ్రైవర్ క్షేమంగా ఉన్నాడు. అయితే, సుమతికి ఏ అపాయమూ జరగలేదన్నమాట. అయిలయ్య వద్ద ఉన్న నీళ్ళ సీసాలు తీసుకుని గటగట తాగేశాడు.

అదెలా సాధ్యం. అసలు వాళ్ళిద్దరూ హాస్పిటల్‌లో ఉండడం ఏమిటి? తనను కిడ్నాప్ చేసినట్టు

ఎవరు ప్రకటించారు. వాళ్ళు నన్ను చెట్టుకు కట్టేసిపోయారు గదా. తల బద్దలవుతోంది. ఏది నిజమో, ఏది కలో తెలియడం లేదు.

అయిలయ్య తెచ్చిన ఆహారం తిని, మళ్ళీ నీళ్ళు తాగాక భుక్తాయాసంతో మళ్ళీ నిద్ర ముంచుకొచ్చింది సత్తయ్యకు.

★ ★ ★

నిస్సత్తువగా పక్కకు కదిలాడు సత్తయ్య. చీకటి పడుతోంది. అయిలయ్య కనిపించలేదు. నాలుక పిడచకట్టుకుపోయింది. దాహంగా ఉంది. కళ్ళు తిరుగుతున్నాయి. చలిజ్వరంతో శరీరం వణుకుతోంది. మెల్లిగా లేచాడు సత్తయ్య. సోలిపోతూ అడుగులు వేశాడు.

ఆ నడకలో మునుపటి గాంభీర్యం లేదు. ఇతరుల కన్నా అధికుణ్ణి అనే తేజస్సు లేదు. కాలువలో నీళ్ళు కనపడేసరికి ప్రాణం లేచి వచ్చింది. నీళ్ళు చల్లుకొని చాలాసేపు స్నానం చేశాడు. మనిషి సన్నబడిపోయాడు. ఎన్నిరోజులు, ఎన్ని నెలలు గడిచిపోయాయో తెలియడం లేదు. స్నానంతో శరీరం మరింత చల్లబడి చలిజ్వరం ఊపందుకుంది. దవడలు టపటప కొట్టుకుంటున్నాయి. చేతులు, కాళ్ళు వణకుతున్నాయి. ముడుచుకొని కాలువ పక్కనే రాయిమీద ఒరిగిపోయాడు.

ఆ కాలువ వద్ద ఎవరో వేట కోసం మాటు వేసినట్టున్నారు. వాళ్ళు గబగబా ఇటు పరిగెత్తుకొస్తున్నారు. ఎక్కడో బాంబు పేలింది. తన పక్కలో పేలినట్లు అదిరిపడ్డాడు సత్తయ్య. భయంతో చెట్టెక్కాడు. ఆహారం పూసిన బాంబును కొరికి తల పగిలిన అడవి పంది ఉరికిన వేపు వాళ్ళు పరుగుతీశారు. హమ్మయ్య అనుకొని చెట్టు దిగాడు సత్తయ్య.

అడవి పంది రాకకోసమే నీళ్ళ వద్ద మాటేసిన చిరుతపులి అరిచి పరిగెత్తింది. అడవి పందిని వేటాడుతూ నక్కల అరుపులు మరోపక్క. భయంతో కొయ్యబారిపోయాడు. మెదడు చురుకుగా పనిచేస్తోంది. అలసిన కాళ్ళకు అంత బలం ఎలా వచ్చిందో, ఒక్కసారిగా పరుగు లంకించుకున్నాడు.

అతను పరుగెడుతూనే ఉన్నాడు. ఇపుడా పరుగులో హోదా లేదు. ఇపుడా మొహంలో గర్వం లేదు, అహం లేదు, తేజస్సు లేదు, అధికారం లేదు. ప్రాణభయంతో అచ్చం మనిషిలా పరుగెడుతూనే ఉన్నాడు. ఇపుడతని అలసటలో, నడకలో మనిషితనం తప్ప మరేమీ లేదు. అతను మళ్ళీ మనిషిగా మారడానికి అది మొదటి మెట్టు.

★ ★ ★

అధికారం తలకెక్కాక మనస్సు మారడానికి ఎదుటివారి ప్రతీకార జ్వాలల్లో కడుక్కోవాల్సి రావడమే విషాదం. వైరుధ్యానికి పునాది అధికారం. సంఘర్షణకు అదే ప్రారంభం. వినయమే పరిష్కారం.

*25, డిసెంబర్, 1997*

*ఇండియా టుడే వారపత్రిక*